క్లుప్తంగా

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సీతానగరం: దీర్ఘకాలంగా 104 సంచారవైద్య సేవలందించే వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, సంఘం ప్రతినిధి కె.ఈశ్వరరావులు కోరారు. ఈ మేరకు మంగళవారం 104 ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలన్న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 సిబ్బంది సీతానగరం పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ పి. ఉషారాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా కేవలం రూ.50 వేలు ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథాకాకుండా చూడాలి. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలి. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలి. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలి. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్ట్‌లో పెట్టాలి. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



నారాయణపురం వద్ద టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్...

బలిజిపేట: రోడ్డు వేసి 8నెలలు అవలేదు, ప్రజా అవసరాల దృష్ట్యా వేసిన రోడ్డుపై హెవీ వెహికల్స్‌తో ఇసుకను ఇష్టానుసారం తరలిస్తూ రోడ్డును పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని దీనిని నిలుపుదల చేయాలని ఆగ్రహిస్తూ నారాయణపురం గ్రామస్తులు టిప్పర్లను మంగళవారం అడ్డుకున్నారు. సాక్షి దినపత్రికలో 'అక్రమంగా ఇసుక రవాణా..' శీర్షికన మంగళవారం ప్రచురితమైన వెలువడిన కథనంపై గ్రామస్తులు స్పందించి ఇసుకతో వస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. చిన్నచిన్న గ్రామాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు, ద్విచక్రవాహనాలు, కార్లు, సైకిళ్లు, నాటుబళ్లు, ట్రాక్టర్లు, రైతులు పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండే విధంగా వేసిన సింగిల్ రోడ్లపై ఇసుకతో టిప్పర్లను ఇష్టానుసారం తిప్పడంతో కొత్తగా వేసిన రోడ్లు అధ్వానంగా తయారై ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై టిప్పర్లు ఈ విధంగా ఈ రోడ్డుపై వస్తే తప్పనిసరిగా అడ్డుకుంటామని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు పాడవకుండా చూడాలని కోరారు.

ఉచిత శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో నిరుద్యోగ యువతకు ఫేబ్రి కటర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కౌసల్య యోజన ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 7981308986లో సంప్రదించాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామ శివారులో సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి పారిపోతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న సారా క్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

సీతంపేట: రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి అన్నారు. మండలంలోని చాకలిగూడలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పించారు.

పుణ్యమాసం..కార్తీకం



- పవిత్రంగా నడుచుకుంటున్న భక్తులు
- వాడవాడలా భక్తి శ్రద్ధలతో పూజలు, వ్రతాలు



గలావల్లి శివాలయంలో పూజలు చేస్తున్న శివస్వాములు

కార్తీకమాసంలో పర్వదినాలు:

- 2వ తేదీన కార్తీక స్నాన ఆరంభం, బలి పాడ్యమి, ఆకాశదీప వ్రత ఆరంభం
- 3న యమ ద్వితీయ, భగినీ హస్త భోజనం, చిత్రగుప్త జయంతి, ధన్వంతరి జయంతి
- 4న త్రిలోచన గౌరీ వ్రతం
- 5న నాగుల చవితి, వల్మీక పూజ, గరుడ పంచమి
- 8న యజ్ఞవల్క జయంతి, కార్తవీర్యార్జున జయంతి
- 9న గోష్టాష్టమి వ్రతం
- 10న అక్షయ నవమి వ్రతం
- 12న బోధనేకాదశి
- 13న క్షీరాబ్ది ద్వాదశి, చిలుకు ద్వాదశి, చాతుర్మాస వ్రత సమాప్తం
- 14న వైకుంఠ చతుర్దశి
- 15న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం
- 16న వృశ్చిక సంక్రమణం
- 19న సంకష్ట హర చతుర్థి
- 26న ఏకాదశి
- 28న మయప్రీతి దీపదానం
- 29న మాస శివరాత్రి
- డిసెంబర్ 1న అమావాస్యతో కార్తీక మాస వ్రత సమాప్తి
- 2న పోలి స్వర్గం, నదులలో దీపాలు వదలడం.

కార్తీకపౌర్ణమి రోజున దీపాలను వెలిగిస్తే దోషాలు తొలగిపోతాయి. దీపాలను నదిలో వదలడం వల్ల శ్రేయస్కరం.

పరమేశ్వరునికి 11, కాలసర్పదోషానికి 212, మాంగళ్య దోషానికి 21, శనిదోషానికి 9, గురు దోషానికి 33, కత్ర దోషానికి 108, దుర్గాదేవికి 9, పుత్ర దోషానికి 51, సర్పదోషానికి 48, రాహు దోషానికి 21దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు సిద్ధిస్తాయని అర్చకులు, పండితులు వివరిస్తున్నారు.

బలిజిపేట:

కార్తీకమాసం హిందువులకు ప్రీతిపాత్రమైనది. ఈ నెల రోజులు ఎంతో నియమ నిష్టలతో శివాలయాల్లో పూజలు చేస్తారు. గ్రామాలు, పట్టణాలు శివనామ స్మరణతో హోరెత్తుతాయి. మాలాధారణలతో భక్తులు శైవక్షేత్రాలను సందర్శిస్తారు. కార్తీకమాసంలో మహిళలు నోములు, దీపారాధనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దీపాన్ని దైవస్వరూపంగా భావించి పూజలు చేస్తారు. ఈ మాసంలో సోమవారాలు, పర్వదినాలలో శివాలయాలు కిటకిటలాడుతాయి. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

దీపారాధన ప్రత్యేకత

కార్తీకమాసంలో ప్రమిదలలో వెలిగించే దీపాలకు ప్రమిదల రకాలను బట్టి ప్రాధాన్యం ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందులో భాగంగా మట్టి ప్రమిదలో దీపం వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుందని, పింగాణీ ప్రమిదలో వెలిగిస్తే ఆ ఇంటికి అలంకరణ వస్తువులు సమకూరుతాయని, ఇత్తడి ప్రమిదలో వెలిగిస్తే ఆయుష్షు పెరుగుతుందని, నిమ్మ ప్రమిదల్లో వెలిగిస్తే అన్ని కార్యాల్లోనూ విజయం సిద్ధిస్తుందని, అరటి దొన్నెల్లో దీపం వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధన రక్షణ కలుగుతుందని, ఉసిరికాయ దీపం వెలిగిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ ప్రకారం అర్చకులు భక్తులకు వివరించి దీపాలను వెలిగించే విధంగా సూచిస్తున్నారు.

శైవకేశవులకు సమ ప్రాధాన్యం

కార్తీకమాసం శివుడు, విష్ణువుకు ప్రీతికరమైనది. అందుకే ఈ మాసంలో ప్రతి సోమవారం శివుడికి, ప్రతి శుక్రవారం, శనివారాల్లో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివపార్వతుల పుత్రుడు అయ్యప్ప దీక్షలు ఈ మాసంలోనే చేస్తారు. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణువుకు తులసి దళార్చన ఈ మాసంలోనే నిర్వహిస్తారు. లక్ష్మీదేవి, కార్తికేయుడు, చంద్రుడు, ఇంద్రుడు, తులసీమాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది. కార్తీకమాసంలో కార్తీక స్నానం, దీపారాధన, ఉపవాసం, దానధర్మాలు, సోమవార వ్రతాలు ముఖ్యమైనవి, ఈ మాసంలో వనభోజనాలకు ఎంతో విశిష్టత ఉంది. నెలరోజుల పాటు జరిగే కార్తీక ఉత్సవాల్లో శివ-పార్వతుల సృష్టిగా పిలవబడే ఉసిరి చెట్టును పూజించి అక్కడ వనభోజనాలు చేస్తే పుణ్యఫలం సిద్ధిస్తుందనేది భక్తుల విశ్వాసం.



గలావల్లి శివాలయ ప్రాంగణంలో అఖండ దీపాన్ని ఏర్పాటుచేసిన అర్చకులు

ధాన్యం రైతుల దైన్యం

- తక్కువ ధరకే తరలిపోతున్న పంట
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



తరలించడానికి సిద్ధంగా ధాన్యం బస్తాలు

సీతానగరం: వారం రోజులుగా యంత్రాలతో వరిచేను కోత పనులు మండలంలో నిర్వహిస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మధ్యవర్తులకు రైతులు ధాన్యం విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. వరి పండిపోవడం వల్ల కొంతమంది రైతులు దీపావళి పండగకు రెండు రోజుల ముందునుంచి వరిచేను కోత పనులు మొదలు పెట్టినా ఇంతవరకూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం, కళ్లాల్లో భద్రపరచడానికి స్థలాల కొరత, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని కారణంగా పంట పండినా అర్థికఇబ్బందులు తప్పేటట్లు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన ధాన్యం పొలాల్లో రాలిపోతాయన్న భయంతో పంటను చూడలేక విక్రయించడానికి మరో దారిలేక ఇతర జిల్లాలకు చెందిన ఉప్పిడి బియ్యం తయారీ మిల్లుల యాజమానులు గ్రామాల్లో నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా పచ్చి ధాన్యమే విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రతిఏటా నవంబరు మొదటి వారానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా ఉన్నా ప్రభుత్వం ఇంతవరకూ ఏర్పాటు చేయలేదని రైతులు మండిపడుతున్నారు. ఇతర జిల్లాల మిల్లర్లు 84 నుంచి 85 కేజీలు బరువున్న ధాన్యం బస్తాను రైతు అవసరాన్ని పసిగట్టి మధ్యవర్తుల రూ 1.380ల నుంచి రూ.1,450 మధ్య కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి దళారుల బారి నుంచి రక్షించడానికి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

యోగా, హోమియోపతితో ఆరోగ్యపరిరక్షణ



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాటలాడుతున్న ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి

- కేంద్రాస్పత్రి వైద్యాధికారిణి సుశీల

బలిజిపేట: యోగా, హోమియోపతి వైద్యం చాలా ఉపయోగకరమైనదని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రి వైద్యాధికారిణి సుశీల అన్నారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీలో ఆశ వర్కర్లకు జాతీయ ఆయుష్‌కమిషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్ ద్వారా ఆరోగ్యాన్ని ఏవిధంగా సంరక్షించుకోవచ్చో వివరంగా తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలు, ఆరోగ్య జీవనం కోసం ఎటువంటి సాధనాలు చేయాలి, యోగా, హోమియో వైద్యాల వల్ల ఉపయోగాలను వివరించారు. మధుమేహ నియంత్రణ, నివారణ, సాధారణ ఔషధ మొక్కలు వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జలో ఆయుష్ వైద్యవిధానంపై శిక్షణ

పార్వతీపురంటౌన్: ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాదులు, మధుమేహం నియంత్రణపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని బూర్జ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి అన్నారు. ఇందుకు సంబంధించి ఆయుష్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని, దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖకు సమర్పించినట్లు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని డోకిశీల, పెదబొండపల్లి పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు వైద్యాధికారులు ఆధ్వర్యంలో డా. హేమాక్షి మంగళవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణకు సంబంధించి ఆయుష్ శాఖ పంపిణీ చేసిన పుస్తకాలు, బ్రోచర్లను ఆశాడే కార్యక్రమం సందర్భంగా అక్కడికి విచ్చేసిన ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ చేతుల మీదుగా ఆశ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.ఐశ్వర్య, డా.కౌశిక్, డా.అనూష, డా.ధరణి, వైద్యసిబ్బంది, తదితనేలే పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం

- సాలూరులో అమలు కాని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



సాలూరు పట్టణంలో మంత్రి ఇంటికి వెళ్లే దారిలో కోర్టు ఎదురుగా రోడ్డుకు వరుసగా ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు

సాలూరు: ఎన్నికల కోడ్ వచ్చిందంటే అధికారులు అప్రమత్తమవుతారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడేది ఐఏఎస్ స్థాయి వ్యక్తులైనా ఎన్నికల కమిషన్ ఉపేక్షించదు. దీంతో పై స్థాయి నుంచి కింది స్థాయి అధికారులందరూ ఎన్నికల కోడ్ వచ్చిందంటే చాలావరకు అప్రమత్తంగానే ఉంటారు. అధికారపార్టీ నేతలతో ఎంత సత్సంబంధాలు ఉన్నా ఎన్నికల కోడ్ సమయంలో మాత్రం వాటన్నింటిని పక్కన పెట్టి ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో భాగంగా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుంటారు.అయితే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో పలువురు అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా అధికారులందరూ పనిచేయాలని రాష్ట్ర,జిల్లాస్థాయి అధికారులు ఆదేశాలు జారీచేస్తుంటే సాలూరు నియోజకవర్గంలో అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సాలూరు పట్టణం, మండలంలో ఎన్నికల కోడ్ అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదు. పట్టణంలోను, మండలాల్లోను మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తున్నాయి. సాక్షి పత్రికలో దీనిపై కథనం రావడంతో పట్టణంలోని కొన్ని ప్రదేశాల్లో ఫ్లెక్సీలు తొలగించినప్పటికీ ఇంకా అనేక ప్రాంతాల్లో నేటికీ మంత్రి ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికలకమిషన్, జిల్లాస్థాయి అధికారులు స్పందించి నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సాలూరు ప్రజలు, పలువురు నాయకులు కోరుతున్నారు.



వెంకటేశ్వర డీలక్స్ వద్ద ఉన్న మంత్రి ఫ్లెక్సీ



సాలూరు మండలం కొత్తవలసలో ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీ

భక్తి శ్రద్ధలతో నాగులచవితి ఉత్సవం



సాలూరు: మామిడిపల్లిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సీతానగరం: నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. కార్తీక మాసంలో పౌర్ణమి ముందు వచ్చే చవితి తిథి రోజున నాగుల చవితిని జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోంది. నాగులచవితి రోజున నాగ దేవతలను పూజించడం ద్వారా భక్తులు సర్వభయాలను తొలగించుకోవచ్చని, సంతాన సిద్ధితోపాటు కుటుంబాల్లో సుఖసంతోషాలను పొందవచ్చని వేదపండితులు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాల శివార్లలో ఉన్న పుట్టలను శుద్ధి చేసి పసుపు, కుంకుమ, వరి పిండితో ముగ్గులు వేశారు. పుట్ట దగ్గర చదును చేసి నాగుల తువ్వాళ్లు, నువ్వులముద్ద, చలివిడి నైవేద్యంగా సమర్పించారు. పూజా సామగ్రితో పుట్టల దగ్గరకు వచ్చిన ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు చేశారు.



పార్వతీపురంటౌన్: సంగంవలస గ్రామంలో పుట్ట దగ్గర పూజలు చేస్తున్న భక్తులు



బలిజిపేట: వెంగాపురంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: బుడ్డిపేటలో పూజలు చేస్తున్న శంకరాపు కుటుంబసభ్యులు



మక్కువ: పుట్టలో పాలు పోసేందుకు వెళ్తున్న గ్రామస్తులు



సీతానగరం: పెదంకలాంలోచదునుచేసిన పుట్టవద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ బి.రమణమ్మ



సీతానగరం: వెంకటాపురంలో నాగదేవత పూజల్లో పాల్గొన్న బుడితి కుటుంబసభ్యులు

విత్తన సేకరణలో జాగ్రత్తలు తప్పనిసరి



గరుగుబిల్లి: మార్కెట్‌లో లభ్యమవుతున్న విత్తనాలలో నకిలీ, తాలుగింజలు కలుస్తుండటంతో పాటు విరివిగా లభించకపోవడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేరొక రైతు వద్ద కొనుగోలుచేసిన విత్తనాలపై రైతులకు పూర్తిస్థాయిలో నమ్మకం లేకపోవడంతో రైతులే నేరుగా విత్తనాలను తయారు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వరికోతలు నిర్వహిస్తున్న తరుణంలో విత్తనాల సేకరణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి పలు విషయాలను వివరించారు. వరి విత్తనాల కోసం ఉదయం 9 గంటల తర్వాతే కోతలను ప్రారంభించాలన్నారు. సాధ్యమైనంతవరకు విత్తనాల కోసం కోసిన పంటను ట్రాక్టర్లతో తొక్కించకుండా బల్లపై కొట్టడం ద్వారా సేకరించడం మంచిదన్నారు. తాలు గింజలు, కేళీలు లేకుండా విత్తనాలను శుభ్రం చేసుకోవాలన్నారు. విత్తనాలను సేకరించేముందు ధాన్యంను 16 శాతం తేమ ఉండేలా ఆరపెట్టుకొని నిల్వ చేసుకోవాలన్నారు. వరివిత్తనాలను నిల్వచేసేముందు సంచులను పోలిడిన్ మందుతో శుభ్రం చేసుకోవాలన్నారు. విత్తనాలను నింపిన సంచులను నేల మీద కాకుండా తడి తగలని ప్రదేశంలో భద్రపరుచు కోవాలని సూచించారు. ఈవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవడంవల్ల మంచి నాణ్యమైన విత్తనాలు తయారుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అగ్ని అస్త్రం తయారీ



ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావులు

బలిజిపేట: మండలంలోని మిర్తివలస బయోమెట్రిక్ ఇన్‌పుట్ సెంటర్ వద్ద అగ్ని అస్త్రం ద్రావణం తయారీపై రైతులకు ఐసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 240లీటర్ల ద్రావణం తయారుచేశారు. దానిని తయారుచేయడం, వినియోగించడంపై రైతులకు స్పష్టంగా తెలియజేశారు. దీని తయారీకి గోమూత్రం, పచ్చిమిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు, వేపాకు, జిల్లేడు ఆకులు అవసరమని చెప్పారు. గోమూత్రాన్ని మరగపెట్టి పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకును గుండగా తయారుచేయాలని, వేపాకు, జిల్లేడు ఆకులను ముద్దగా నూరి గుండను, ముద్దను గోమూత్రంలో వేసి రెండు, మూడు పొంగులు వచ్చేవరకు మరిగించాలని తెలిపారు. తరువాత దాన్ని 48గంటలు నిల్వ ఉంచగా తయారైన కషాయాన్ని వడకట్టి 100లీటర్ల నీటిలో 6నుంచి 8లీటర్లు కలిపి స్ప్రే చేయాలని వివరించారు. ఈ ద్రావణాన్ని పచ్చపురుగు, కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు నివారణకు అన్ని రకాల పంటలలో వినియోగించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.